
తాళ్ళరేవు మండలం గాడిమొగ దగ్గర నెలకొన్న రిలయన్స్‌వారి సహజవాయువు ప్రాజెక్టు రెండు మండలాలలో ఎంతలేదన్నా 12 వేల మత్స్యకారుల జనాభా పొట్టగొట్టిన వైనం తూర్పు గోదావరి జిల్లాలో ఇప్పుడందరూ ఎరిగినదే.

'రిలయన్స్‌ను కేంద్ర ప్రభుత్వమే ఏమీ చేయలేదు' అని జిల్లా అధికారులు నమ్మో నమ్మకో తమ అశక్తతను వ్యక్తం చేసినప్పటికీ మత్స్యకారులు మాత్రం నిస్సహాయంగా చేతులెత్తేయలేదు. తమ జీవనాన్ని పోగొట్టిన ఈ ప్రాజెక్టును నిరసిస్తున్నారు, న్యాయం కోరుతున్నారు. ప్రతి రోజూ టి.వి కెమెరాల ముందు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మీద నిప్పులు చెరుగుతూ దుమ్మెత్తి పోస్తూ కనిపించే ప్రతిపక్ష పార్టీలుగాని, ఏ ప్రజాసంఘాలు గానీ వారికి అండగా రాకున్నా వారికి తెలిసిన పద్ధతిలో ప్రతిఘటిస్తున్నారు. ప్రతిఘటన మత్స్యకారులకు కొత్త కాదుగానీ తుఫానులను ప్రతిఘటించడం వేరు, పెట్టుబడిని ప్రతిఘటించడం వేరు. దీనికి తెలిసినన్ని కిటుకులు దానికేం తెలుసు?

రిలయన్స్ కిచ్చిన 217 ఎకరాల భూమిలో 80 ఎకరాల మేరకు మడ అడవులుండేవి. తక్కిన భూభాగంలో చేపల చెరువులూ, రొయ్యల చెరువులూ ఉండేవి. మడ అడవులుండే భూమిని ఏ పరిశ్రమకైనా అప్పగించడం చట్టాల పరిధిలో అంత సులభంకాదు. ప్రభుత్వం ఒకవేళ చట్టాన్ని పక్కనపెట్టి అప్పగించేసినా కోర్టులు ఒప్పుకోవు. తీరప్రాంత పర్యావరణ రక్షణలో మడ అడవులకుండే పాత్ర అటువంటిది.

అయినప్పటికీ రిలయన్స్‌కు ఆ భూమి అప్పగించారంటే దాని వెనకొక కథ ఉంది. మొదట ఆ భూమిని ప్రైవేటు భూమిగా చూపించి ఎవరి నుండో కొనుక్కున్నారు. స్థానిక సామాజిక కార్యకర్తలు ఈ విషయాన్ని గ్రహించి కోర్టులో కేసు వేయకపోతే కథ అక్కడితో అయిపోయేది. ఆ తరువాత ప్రభుత్వమే

# రిలయన్స్‌కు ఏ రూల్సూ వర్తించవా?



## జీవనం కోల్పోతున్న గాడిమొగ, భైరవపాలెం మత్స్యకారులు

ఆ భూమిని రిలయన్స్ వారికి ఎకరా 50 వేలకు ఇచ్చేసింది. మడ అడవులుండే భూమిని ఎట్లా ఇస్తారని ఎవరైనా అడగగలరని ఇచ్చినవారికీ, తీసుకున్నవారికీ తెలుసు. కాబట్టి రిలయన్స్‌వారు స్థానిక ప్రజలకే హెచ్చుకూలి ఇచ్చి రాత్రికి రాత్రే మడ అడవి మొత్తం కొట్టేయించారు. ఆ తరువాత పర్యావరణ నివేదిక తయారుచేసి బహిరంగ ప్రజావిచారణ చేపట్టారు. ఆ నివేదిక ప్రకారం రిలయన్స్‌కిచ్చిన భూమికి మూడు హద్దుల వెంబడి మడ అడవులున్నాయి గానీ (నాలుగవ హద్దు తాళ్ళరేవు - భైరవపాలెం రోడ్డు) ఆ భూమిలో మాత్రం మడ అడవులు లేవు. చుట్టూ ఉన్న మడ అడవులకు నష్టం కలిగించని పద్ధతిలో రిలయన్స్ వారు పర్యావరణ రక్షణ చేపట్టాలన్న షరతులతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తన సమ్మతి వెనువెంటనే తెలిపేసింది.

తుఫానులకు ఇంత తెలివెక్కడిది?

అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు సందేహం వచ్చింది. వారి దగ్గరున్న మ్యాపులను చూస్తే ఈ ప్రాంతంలో గోదావరి నదికి ఉత్తరాన, నది ఒడ్డుదాకా, కోరింగ అభయారణ్యం అనే రక్షిత ప్రాంతం ఉండాలంట. దానిలో అరుదైన జంతుజాతులు, మడ అడవులు ఉండాలంట. కానీ పర్యావరణ అనుమతికోసం రిలయన్స్ వారు పంపిన ప్రతిపాదనతో జతచేసిన మ్యాపులో ఆ అభయారణ్యం ప్రస్తావనే లేదట. దీని సంగతేమిటి మహాశయా అని వారు రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణాధికారిని అడిగారు.

ఆ అధికారి ఈ ప్రశ్నలకు తొణకలేదు, బెణకలేదు. మ్యాపులో అభయారణ్యం ఎందుకు లేదన్న ప్రశ్నకు జవాబు చెప్పకుండా, అభయారణ్యానికి గానీ, రిజర్వ్ ఫారెస్టుకు గానీ నష్టం వాటిల్లకుండా రిలయన్స్‌వారు సహజవాయువు పైప్‌లైన్లను నది గర్భంగుండా తీసుకురావడం ద్వారా 'తగు జాగ్రత్తలు తీసుకుంటారని మాకు అనిపిస్తున్నది' అనీ, వారికి అప్పగించిన భూమి పరిసరాలలో పాడైపోయిన మడ అడవులున్నాయి కాబట్టి రిలయన్స్‌వారు వాటిని ఉద్ధరించడానికి ప్రయత్నించడం అభిలషణీయమనీ, మొత్తంమీద 'కోరింగ అభయారణ్యానికి చెప్పుకోదగ్గ హాని జరగదని నమ్మకంగా చెప్పగలం' అనీ జవాబు చెప్పారు. మ్యాపులో చూపించని అభయారణ్యానికి హాని జరగడం ఏమిటి, జరగకపోవడం ఏమిటి?

ఇంకెప్పుడైనా అడవిలో చెట్లు నరికారని పేదల మీద కేసులు పెట్టినప్పుడు ఈ కథ జ్ఞాపకం చేసుకుందాం.

ఈ విధంగా దొడ్డిదారిన భూమి పొందిన రిలయన్స్‌వారు ఆ 217 ఎకరాలనూ చదును చేసి తమ పరిశ్రమ నిర్మాణం మొదలుపెట్టారు. అప్పటివరకు అక్కడ కొన్ని చేపల చెరువులూ, రొయ్యల చెరువులూ ఉండేవని చెప్పాము కదా. తాళ్ళరేవు మండలం గోపాలపురానికి చెందిన దళితులూ, ఇతర పేదలూ ఆ చెరువుల మీద కూలి చేసుకుని జీవనం పొందేవారు. మొత్తం 70 మందికి జీవనం దొరికేది. రిలయన్స్‌వారు ఆ భూములు తీసుకున్న తరువాత చెరువుగట్లన్నీ తెంపేసి నేలంతా చదును చేశారు. గోపాలపురం పేదలకు జీవనం పోయింది.

చట్టం పరిభాషలో వారు ప్రాజెక్టు నిర్వాసితులు కారు గానీ ప్రాజెక్టు బాధితులు. అంటే వాళ్ళ గుడిసెలు పదిలంగానే ఉన్నాయి గానీ పని పోయింది. 2005 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నెం. 68 ప్రకారం వారికి 750 రోజుల దినకూలి నష్టపరిహారంగా దక్కాలి. కానీ అటువంటి జివో

ఒకటి లేనట్టు, గోపాలపురం పేదలకు ఏ హక్కులూ లేనట్టు, జిల్లా అధికారులు నటిస్తున్నారు. అటువంటి జివో ఉందని జనానికి కూడా తెలీదు కాబట్టి వాళ్ళూ ఆ హక్కు అడగలేదుగానీ మా గతేమిటని మాత్రం అడిగారు. రిలయన్స్‌వారి పరిశ్రమలో మీకు ఉద్యోగాలొస్తాయని జవాబు చెప్పారు. ప్రస్తుతం నడుస్తున్న కట్టడం పనులలో గోపాలపురానికి చెందిన 20 మందికి మాత్రమే కాంట్రాక్ట్ కార్మికులుగా పని దొరికింది. కట్టడం పని అయిపోయిన తరువాత అదీ ఉండదు.

ఇక మత్స్యకారుల విషయానికొస్తే, దాదాపు 12,000 జనాభా గల రెండు గ్రామ పంచాయతీల వారు తమ జీవనాన్ని కోల్పోయారు ఆ గ్రామాలు తాళ్ళరేవు మండలానికి చెందిన గాడిమొగ, ఐ.పోలవరం మండలానికి చెందిన భైరవపాలెం. ఆ జనం సముద్రంలోనూ, అక్కడికి సమీపంలో సముద్రంలో కలిసే గాడేరు, నీలారం నదులలోనూ చేపలు, రొయ్యలు పట్టుకొని జీవించేవారు. మంచి ఆదాయం పొందేవారు. ఆ నదులలోకి నీళ్ళు తెచ్చే కాలవలన్నిటినీ రిలయన్స్‌వారు నేల చదును చేసే క్రమంలో మూసేశారు. నేల చదును చేయడానికి కావలసిన మట్టిని గాడేరు సముద్రాన్ని కలిసే చోట డ్రెడ్జర్ల సహాయంతో తవ్వి తీశారు. ఈ పనిలో డ్రెడ్జర్లు (తవ్వోడలు) అటూ ఇటూ తిరగడంతో గాడేరులో ఇసుక అడ్డదిడ్డంగా మేటవేసింది. వేటకోసం బయలుదేరిన మత్స్యకారుల పడవలు మేటవేసిన ఇసుకలో చిక్కుకు పోసాగాయి. తవ్వోడల హడావుడి వల్ల చేపలు తదితర జలచరాల పునరుత్పత్తి బాగా దెబ్బతినింది. వేగంగా దూసుకుపోయే రిలయన్స్ కంపెనీ వారి పడవల దెబ్బకు మత్స్యకారులు విసిరిన వలలు తెగిపోసాగాయి.

ఇదంతా సహజవాయువు సరఫరా మొదలుకాకముందే జరిగిపోయింది. 'ఆన్ షోర్' కట్టడాల నిర్మాణం జరుగుతున్న దశలోనే జరిగిపోయింది. ఈ నష్టాన్ని కాదనలేకపోయిన ప్రభుత్వం, ఇది కేవలం కట్టడపు పనుల దశలోనే జరుగుతుందనీ, ఆ తరువాత తవ్వోడల హడావుడి ఉండదు కాబట్టి మత్స్యకారులు స్వేచ్ఛగా వేట చేసుకోవచ్చుననీ చెప్పి, 6 నెలల కాలానికి ఒక్కొక్క నావకు నెలకు 6,000 రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించే ఏర్పాటుచేసింది. అయితే ఇది కూడా సమంగా జరగలేదు. ఇన్సూరెన్స్‌గానీ, మత్స్యశాఖ గుర్తింపు కార్డు గానీ ఉంటేనే లెక్కలోకి తీసుకుంటామని చెప్పి గాడిమొగలో ఉన్న 600 నావలకు గాను 150 నావలకు, భైరవపాలెంలోని 776 నావలకు గాను 400 నావలకు మాత్రమే ఈ నష్టపరిహారం పరిమితం చేశారు.

**దేశ అభివృద్ధికి కావలసిన ఇంధనాల వెలికితీత కోసం నదులనూ, సముద్రాలనూ, అడవులనూ, సమస్త ప్రకృతినీ రిలయన్స్ వంటి కంపెనీల చేతిలో పెట్టడం తప్పనిసరి అని భావించేటట్టయితే, ఆ ప్రకృతి పైన ఆధారపడి బతుకుతున్న ప్రజల జీవనాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం మీద లేదా? 60 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అభివృద్ధి నిమిత్తం భూములూ వనరులూ జీవన అవకాశాలూ కోల్పోయిన ప్రజలకొక పునరావాస హక్కంటూ ఇంతవరకు కల్పించలేదు. అడవి ప్రాంతాలలో ఆదివాసులు, తీరప్రాంతాలలో మత్స్యకారులు భారీగా దీనికి మూల్యం చెల్లించారు.**

అసలు సమస్య ముందుంది. ఆఫ్ షోర్ (సముద్రంలో) డ్రిల్లింగ్ చేసి వెలికితీసే సహజ వాయువును, కొంత పెట్రోలియంను రిలయన్స్‌వారు గొట్టాలద్వారా గాడిమొగ వద్ద నిర్మిస్తున్న ఆన్ షోర్ (సముద్ర తీరం మీద నున్న) ప్రాసెసింగ్ కేంద్రానికి తీసుకురావాలి. చుట్టూ ఉన్న రిజర్వ్ ఫారెస్టు, మడ అడవులు, కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలకు నష్టం కలిగించకుండా ఉండవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పైప్‌లైన్లను నీటిలో నుండి వేసి గాడిమొగవద్ద తీరం మీదికి తీసుకురావాలని ప్రతిపాదించారు. సముద్ర గర్భంలోను, నది గర్భంలోను నేలకింద ఒకటిన్నర మీటర్ల లోతున ఈ పైప్‌లైన్ వేయబడుతుంది. పైప్‌లైన్ నీటికింద నేలలో పూడ్చి పెట్టబడుతుంది కాబట్టి సముద్ర జీవులకేమీ కష్టం కలగదని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణాధికారి అంటాడు గానీ ఈ పైప్‌లైన్ వేసేటప్పుడు, ఆ తరువాత దాని సంరక్షణ చేసేటప్పుడు కంపెనీ పడవల హడావుడి చాలా ఉంటుందని, మత్స్యకారుల పడవలు స్వేచ్ఛగా తిరగలేకపోవచ్చునని ఆయనే ఒప్పుకుంటాడు. ఈ హడావుడి వల్ల నీళ్ళు బురదై జలజీవాల పునరుత్పత్తి దెబ్బతినగలదని పర్యావరణ అనుమతిపత్రం గుర్తించింది. పైప్‌లైన్ల ద్వారా సహజ వాయువేకాక పెట్రోలియం కూడా కొంత వెలికి తీయబడుతుంది కాబట్టి పెట్రోలియం ప్రమాదవశాత్తు నీటిలోకి ఒలికిపోయే ప్రమాదం (ఆయిల్ స్పిల్) లేకపోలేదని కూడా పర్యావరణ అనుమతిపత్రం గుర్తించింది. అది ఒక్కసారి జరిగితే ఇంక ఆ నీళ్ళు నీళ్ళు కావు. ఆయిల్ స్లిప్ ఎప్పుడోగానీ సంభవించకపోవచ్చును గానీ రసాయన కాలుష్యం, డ్రైనేజ్ నీటి కాలుష్యం మాత్రం నిత్యం ఉంటాయి. నీటి సహజత్వం, నీటి ప్రవాహం సహజత్వం ధ్వంసం అవుతాయి. ఆ తరువాత గాడిమొగ, భైరవపాలెం గ్రామాల మత్స్యకారులు అక్కడ రొయ్యలు, చేపలు పట్టుకొని బతకడం కల్ల.

వాళ్ళంతా ఏం కావాలి అన్న ప్రశ్న ప్రభుత్వానికి అక్కరలేదా? దేశ అభివృద్ధికి కావలసిన ఇంధనాల వెలికితీత కోసం నదులనూ, సముద్రాలనూ, అడవులనూ, సమస్త ప్రకృతినీ రిలయన్స్ వంటి కంపెనీల చేతిలో పెట్టడం తప్పనిసరి అని భావించేటట్టయితే, ఆ ప్రకృతి పైన ఆధారపడి బతుకుతున్న ప్రజల జీవనాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం మీద లేదా? 60 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అభివృద్ధి నిమిత్తం భూములూ వనరులూ జీవన అవకాశాలూ కోల్పోయిన ప్రజలకొక పునరావాస హక్కంటూ ఇంతవరకు కల్పించలేదు. లక్షలాది ప్రజానీకాన్ని భిక్షగాళ్ళను చేస్తూ 'దేశాన్ని' అభివృద్ధి చేస్తున్నారు. అడవి ప్రాంతాలలో ఆదివాసులు, తీరప్రాంతాలలో మత్స్యకారులు భారీగా దీనికి మూల్యం చెల్లించారు. ఇది అన్యాయమని ఆందోళన చేయగా చేయగా ప్రాజెక్టు బాధితుల పునరావాసానికొక విధానం రూపొందిస్తున్నామని కొంతకాలంగా అంటూ వస్తున్నారు. అదెప్పటికీ 'జరగబోతూ' ఉంటుంది గానీ ఈ లోపల అభివృద్ధి పేరిట ప్రజల విస్థాపన మాత్రం 'జరిగిపోతూ' ఉంటుంది. ప్రజలు నోరులేని జీవాలలాగ తలవంచి ఊళ్ళు ఖాళీ చేస్తున్నంతకాలం ఈ వంచన సాగుతుంది. సాగనివ్వమని బాధితులే కాదు బాధితుల తరఫున యావత్ సమాజం లేచి నిలబడిన రోజున మాత్రమే అభివృద్ధిని గురించి మానవీయంగా ఆలోచించడం పాలకులు నేర్చుకుంటారు.

**మానవహక్కుల వేదిక (HRF)**
తూర్పుగోదావరి జిల్లా శాఖ

**20-2-2008**